**చిదంబరం**

భారత అణు కార్యక్రమ నిర్మాత రాజగోపాల చిదంబరం జనవరి 4న మరణించారు. 1974, 98లలో నిర్వహించిన అణు పరీక్షల్లో కీలక పాత్ర పోషించారు. భారత్ నిర్వహించిన అణ్వస్త్ర కార్యక్రమంలో పాలుపంచుకున్నారు. భారత ప్రభుత్వ ప్రిన్సిపల్ సైంటిఫిక్ సలహాదారుగా, బార్క్ చైర్మన్‌గా, అణు ఇంధన కమిషన్ చైర్మన్‌గా, భారత ప్రభుత్వ కార్యదర్శిగా పని చేశారు. 1975లో పద్మశ్రీ, 1999లో పద్మ విభూషణ్ పురస్కారాలు అందుకున్నారు.

# చదువులా? శిక్షలా?



- ఇది పరీక్షల సీజన్. ప్రస్తుతం ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థులకు జనవరి చివరి నుంచి జూన్ వరకు వరుసగా పరీక్షలు ఉన్నాయి. జనవరి 22 నుంచి నెలాఖరు వరకు జేఈఈ మెయిన్స్ సెషన్–1 ఉంది. ఐఐటీ, ఎన్ఐటీ, ఐఐఐటీల్లో సీటు సాధించడమే లక్ష్యంగా రెండేండ్లుగా అహోరాత్రులు శ్రమిస్తున్న విద్యార్థులకు ఇది అత్యంత కీలకమైన పరీక్ష. ఆయా ప్రతిష్ఠాత్మక విద్యాసంస్థల్లో ఉన్నవి సుమారు నలభై వేల సీట్లు. వాటి కోసం పోటీపడుతున్నవారు సుమారు 13 లక్షల మంది. ప్రపంచంలో అత్యంత కఠినమైన పరీక్షల్లో ఒకటిగా జేఈఈ మెయిన్స్‌కు పేరున్నది. మెయిన్స్ ఫస్ట్ సెషన్ పూర్తి కావడమే ఆలస్యం ఫిబ్రవరి 3 నుంచి ఇంటర్ ప్రాక్టికల్ ఎగ్జామ్స్ మొదలవుతాయి. ఆ వెంటనే మార్చి 5 నుంచి ఇంటర్ వార్షిక పరీక్షలు. ఏప్రిల్‌లో మళ్లీ జేఈఈ మెయిన్స్ సెషన్–2 ఉంటుంది. మెయిన్స్–1, మెయిన్స్–2 ఈ రెండింటిలో ఎందులో ఎక్కువ స్కోర్ సాధిస్తే దాన్ని పరిగణనలోకి తీసుకుంటారు. మెయిన్స్‌లో అర్హత సాధిస్తే.. మే 18న జేఈఈ అడ్వాన్స్‌డ్ రాయాలి. అడ్వాన్స్‌డ్‌లో సాధించిన స్కోర్ ఆధారంగా ఐఐటీల్లో సీట్లు కేటాయిస్తారు. వీటితో పాటు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ ఇతర రాష్ట్రాల్లోని ఇంజినీరింగ్ కాలేజీల్లో ప్రవేశాల కోసం నిర్వహించే ఎంసెట్స్, ఇతర ప్రైవేట్ యూనివర్సిటీలు, బిట్స్ లాంటి ప్రతిష్ఠాత్మక సంస్థలు సొంతంగా నిర్వహించే ఎంట్రన్స్ టెస్టులు ఉంటాయి. ఇంజినీరింగ్ విద్యను అభ్యసించదలచుకున్న ఎంపీసీ విద్యార్థులకు ఇలా వరుసగా జూన్ వరకు నిత్యం పరీక్షలే. ఎంబీబీఎస్ సీటే లక్ష్యంగా బైపీసీ గ్రూప్‌లో చేరిన విద్యార్థులదీ ఇదే పరిస్థితి. వారికి ఊపిరి సలపని పరీక్షల షెడ్యూల్ ఉంది. వీటికితోడు కార్పొరేట్ విద్యా సంస్థలు రోజూ నిర్వహించే గ్రాండ్ టెస్టులు, మాక్ టెస్టులు విద్యార్థులను ఉక్కిరి బిక్కిరి చేస్తుంటాయి.
- ఇవి ప్రాక్టీస్ మ్యాచ్ లాంటివి. వీటిని ఎంత ఎక్కువగా సాధన చేస్తే ఫైనల్ పరీక్షలో అంత ఎక్కువ ఫలితం సాధించే వీలుంటుందని, టైమ్ మేనేజ్‌మెంట్ తెలుస్తుందని అధ్యాపకులు చెబుతుంటారు. దీనివల్ల ప్రాక్టీస్ టెస్టులు ఏయే చాప్టర్లలో బలంగా ఉన్నారో, ఏయే అంశాల్లో బలహీనంగా ఉన్నారో విశ్లేషించుకొని, లోపాలను సరిదిద్దుకోవడానికి, తదనుగుణంగా ప్రిపరేషన్ ప్రణాళికను రూపొందించుకోవడానికి దోహదపడతాయి. అధ్యాపకులు కూడా గ్రాండ్ టెస్టుల ఆధారంగా ఆయా విద్యార్థుల లోపాలను గుర్తించి, వాటిని అధిగమించే దిశగా ప్రత్యేక మార్గదర్శనం చేస్తే ఆయా విద్యార్థులకు మేలు జరుగుతుంది. నిత్యం గ్రాండ్ టెస్టులు నిర్వహించే కాలేజీల్లో ఈ స్ఫూర్తి లోపిస్తున్నది. రానురాను గ్రాండ్ టెస్టులు అనేవి విద్యార్థులను టార్చర్ పెట్టేవిగా, వారి మీద ఒత్తిడి పెంచేవిగా, వారి మానసిక స్థైర్యాన్ని దెబ్బతీసేవిగా మారుతుండటం దురదృష్టకరం. తాము పెట్టే టెస్టుల్లో ఆశించిన స్థాయిలో మార్కులు సాధించలేకపోయిన విద్యార్థులను చిన్నచూపు చూడటం, ఇతరులతో పోల్చి కించపరచడం, టాపర్ల నుంచి వేరుచేయడం చాలా కాలేజీల్లో పరిపాటిగా మారుతున్నది. మరోవైపు మార్కులు తక్కువ వచ్చినప్పుడల్లా ఇంట్లో తల్లిదండ్రులు కూడా తమ బిడ్డలను తిట్టడం, ఒక్కోసారి అనరాని మాటలు అనడం, వారి మనోభావాలను గాయపరచడం, చివరకు సహనం కోల్పోయి దండించడం లాంటి దృశ్యాలు చాలా కుటుంబాల్లో కనిపిస్తున్నాయి. ఐఐటీ, ఎన్ఐటీ, ఐఐఐటీ, టాప్ టెన్ ఇంజినీరింగ్ కాలేజీల్లో సీటు రాకపోతే జీవితమే వ్యర్థమని, పిల్లలకు మంచి కెరీర్ ఉండదనే భయం చాలామంది తల్లిదండ్రులను వెంటాడుతున్నది. అందుకే తమ పిల్లలకు ప్రతిష్ఠాత్మక కాలేజీల్లో సీటు రావాలని వారు తాపత్రయపడుతున్నారు. లక్షలు వెచ్చించి ఇంటర్ చదివిస్తున్నారు. ఆరేడు తరగతుల నుంచే ఫౌండేషన్ కోర్సులకు పంపిస్తున్నారు. ఇంత చేసినా తాము ఆశించిన స్థాయిలో విద్యార్థులకు మార్కులు, ర్యాంకులు రాకపోతే తట్టుకోలేకపోతున్నారు. తల్లడిల్లిపోతున్నారు. పిల్లల మీద వివిధ రూపాల్లో ఒత్తిడి ప్రయోగిస్తున్నారు. పరీక్షల తేదీలు సమీపిస్తున్న కొద్దీ పిల్లల మీద కుటుంబసభ్యులు, కాలేజీలు ప్రయోగించే ఒత్తిడి ఎక్కువవుతున్నది. ఇలాంటి ధోరణి విద్యార్థుల మీద నెగెటివ్ ప్రభావం చూపిస్తుందని, వారిలో ఆత్మవిశ్వాసాన్ని దెబ్బతీయడమే కాకుండా ఆత్మనూన్యతా భావాన్ని పెంపొందిస్తుందంటూ మనో వైజ్ఞానిక నిపుణులు, విద్యావేత్తలు చేస్తున్న హెచ్చరికలను ఎవరూ పట్టించుకోవడం లేదు.
- గ్రాండ్, మాక్ టెస్టుల్లో వచ్చే మార్కులను చూసి విద్యార్థులుకాని, తల్లిదండ్రులుకాని టెన్షన్ పడటం వల్ల, డీలా పడటం వల్ల ప్రయోజనం లేదు. ఆయా పరీక్షల్లో చేస్తున్న పొరపాట్లను అర్థం చేసుకొని, వాటిని సరిదిద్దుకోవడం ద్వారానే మరింత మెరుగైన ఫలితాలు సాధించగలమన్న వాస్తవాన్ని గ్రహించాలి. నిజానికి పరీక్షల ముంగిట్లో తల్లిదండ్రులు, అధ్యాపకులు చేయాల్సింది విద్యార్థుల్లో మానసిక స్థైర్యాన్ని పెంపొందించడం. ఫలితం ఎలా ఉన్నా అండగా ఉంటామంటూ భుజం తట్టి ప్రోత్సహించడం. విద్యార్థులు తగినంత నిద్ర పోయేలా, రోజు పది పదిహేను నిమిషాలైనా వ్యాయామం, యోగా, ధ్యానం లాంటివి చేసేలా ప్రోత్సహించడం, పౌష్టికాహారం అందించడం. ఏకాగ్రతతో చదువుకోవడానికి అవసరమైన ప్రశాంత వాతావరణం కల్పించడం. ఇలాంటి చర్యలు మాత్రమే సత్ఫలితాలను ఇస్తాయని, అదే పనిగా పొద్దస్తమానం ఒత్తిడిని ప్రయోగించడం అనర్థాలకు దారితీస్తుందనే విషయాన్ని తల్లిదండ్రులు గుర్తించాలి.
- పిల్లల మీద తల్లిదండ్రులకు ఆశలు ఉండటం సహజం. వారికి మంచి కెరీర్‌ను అందించాలని తాపత్రయపడటంలో తప్పులేదు. అదే సమయంలో తమ బిడ్డల నాలెడ్జ్ లెవల్స్, వారి శక్తి సామర్థ్యాలకు సంబంధించిన వాస్తవిక పరిస్థితిని కూడా అర్థం చేసుకోవాలి. పిల్లల నుంచి తాము ఆశిస్తున్నదానికి, వారు ప్రదర్శిస్తున్న ప్రతిభకు మధ్య ఉన్న గ్యాప్‌ను అర్థం చేసుకోవాలి. విద్యార్థులు కూడా గ్రాండ్ టెస్టుల్లో మార్కులు తక్కువ వస్తున్నాయనో, అధ్యాపకులు, తల్లిదండ్రులు తిడుతున్నారనో బాధపడటం, సీటు రాదేమోనని ఆందోళన చెందడం వల్ల లాభం లేదు. వాటిని మనసులోకి రానీయకుండా, తాము వేసుకున్న ప్రణాళిక ప్రకారం ప్రిపరేషన్ మీదనే దృష్టి సారించాలి. పట్టు వదలని విక్రమార్కుడిలా చివరి నిమిషం దాకా కృషిని కొనసాగించాలి. ఒక్కోసారి పోటీ పరీక్షల ఫలితాలు విచిత్రంగా ఉంటాయి. మనం ఆశించినంత బాగా పరీక్ష రాయలేకపోయినా, ఇతర విద్యార్థులు ఆ మాత్రం కూడా రాయలేకపోతే టాపర్స్‌గా మనమే నిలుస్తామన్న విషయాన్ని ప్రతి విద్యార్థి సదా మనసులో ఉంచుకోవాలి. పరీక్షలు దగ్గరపడుతున్నా తమ పిల్లలు యూట్యూబ్, ఇన్‌స్టాగ్రామ్, వాట్సాప్, ఫ్రెండ్స్‌తో కబుర్లకు ఎక్కువ సమయం వృథా చేస్తున్నారని, అందుకే తాము ఆశించిన స్థాయిలో మార్కులు రావడం లేదనేది చాలామంది తల్లిదండ్రుల ఫిర్యాదు. ఈ విషయాన్ని విద్యార్థులు కూడా సీరియస్‌గా ఆలోచించాలి. ఇందుకు వెచ్చిస్తున్న సమయం మీద స్వీయ నియంత్రణ పాటించినప్పుడే చదువుల మీద ఏకాగ్రత కుదురుతుంది. మార్కులు, ర్యాంకులు, ప్రతిష్ఠాత్మక కాలేజీల్లో చదువులు మాత్రమే జీవితం కాదని, వాటితో నిమిత్తం లేకుండానే అద్భుతాలు సాధించవచ్చుననే విషయాన్ని విద్యార్థులు, తల్లిదండ్రులు గ్రహించాలి.

**కందిబండ కృష్ణప్రసాద్**
**9182777010**

## ఎన్‌పీటీఐలో ఎంబీఏ...

**కేంద్ర విద్యుత్ మంత్రిత్వ శాఖ పరిధిలోని నేషనల్ పవర్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్ (ఎన్‌పీటీఐ)లో ఎంబీఏ కోర్సులో ప్రవేశాల కోసం ప్రకటన విడుదలైంది.**

**కోర్సులు:** ఎంబీఏ
**స్పెషలైజేషన్లు:** సస్టెయినబుల్, సైబర్ సెక్యూరిటీ అండ్ క్లౌడ్, డేటా సైన్స్ అండ్ డేటా అనలిటిక్స్
**అర్హతలు:** ఏదైనా డిగ్రీ ఉత్తీర్ణత
**వెబ్‌సైట్:** www.npti.gov.in

## మేనేజ్‌లో పీజీ డిప్లొమా

**హైదరాబాద్‌లోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ అగ్రికల్చరల్ ఎక్స్‌టెన్షన్ మేనేజ్‌మెంట్ (మేనేజ్)లో పీజీ డిప్లొమా కోర్సులో ప్రవేశాల కోసం ప్రకటన విడుదలైంది.**

**కోర్సు:** పోస్ట్ గ్రాడ్యుయేట్ డిప్లొమా ఇన్ మేనేజ్‌మెంట్ (అగ్రిబిజినెస్ మేనేజ్‌మెంట్)– 2025–27
**అర్హతలు:** డిగ్రీ (అగ్రికల్చర్ సైన్సెస్/అగ్రికల్చర్) ఉత్తీర్ణతతో పాటు క్యాట్–2024 స్కోర్ కలిగి ఉండాలి.
**ఎంపిక:** క్యాట్–2024 స్కోర్, గ్రూప్ డిస్కషన్, ఎస్సే రైటింగ్, అకడమిక్ రికార్డ్, పర్సనల్ ఇంటర్వ్యూ తదితరాల ఆధారంగా
**దరఖాస్తు:** ఆన్‌లైన్‌లో
**చివరితేదీ:** ఫిబ్రవరి 10
**వెబ్‌సైట్:** http://https//www.manage.gov.in

## పీజీ డిప్లొమా కోర్సులు

**భోపాల్‌లోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నికల్ టీచర్స్ ట్రైనింగ్ అండ్ రీసెర్చ్ (ఎన్ఐటీటీటీఆర్)లో పీజీ డిప్లొమా కోర్సుల్లో ప్రవేశాల కోసం ప్రకటన విడుదలైంది.**

**కోర్సులు:** పీజీ డిప్లొమా ఇన్
1. ఇండస్ట్రియల్ ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్
2. మెకట్రానిక్స్ అండ్ రోబోటిక్స్
3. ప్రొడక్ట్ డిజైన్, వ్యాలిడేషన్, ఆప్టిమైజేషన్
4. అడిటివ్ అండ్ డిజిటల్ మ్యానుఫ్యాక్చరింగ్
5. ఎలక్ట్రిక్ వెహికల్ టెక్నాలజీ
6. ఏఐ అండ్ ఎంఎల్
7. ఎనర్జీ హార్వెస్టింగ్ అండ్ స్టోరేజ్
8. బ్యాంకింగ్ అండ్ మైక్రోఫైనాన్స్
9. ఏఆర్–వీఆర్ క్రియేటివిటీ అండ్ యానిమేషన్

**నోట్:** పై కోర్సుల కాలవ్యవధి ఏడాది
**డిప్లొమా కోర్సులు (ఆరు నెలలు)**
సెమీ కండక్టర్ ప్యాకింగ్ (OSAT/ATMP), క్యామ్&సీఎన్‌సీ కంట్రోలర్, అగ్రిటెక్&డ్రోన్ టెక్నాలజీ
**దరఖాస్తు:** వెబ్‌సైట్‌లో
**చివరితేదీ:** ఫిబ్రవరి 7
**వెబ్‌సైట్:** www.nitttrbpl.ac.in



## ఓయూలో పీహెచ్‌డీ

**ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని వివిధ ఫ్యాకల్టీల్లో కేటగిరీ–2 కింద పీహెచ్‌డీ–2025 ప్రవేశాల కోసం ప్రకటన విడుదలైంది.**

పీహెచ్‌డీ ఎంట్రన్స్–2025
**ఫ్యాకల్టీలు:** సైన్స్, ఆర్ట్స్, సోషల్ సైన్సెస్, కామర్స్, సైన్స్, ఎడ్యుకేషన్, లా, మేనేజ్‌మెంట్, ఇంజినీరింగ్, ఫార్మసీ, టెక్నాలజీ అండ్ ఇన్ఫర్మాటిక్స్, ఓరియంట్ లాంగ్వేజెస్
**అర్హతలు:** సంబంధిత విభాగంలో కనీసం 55 శాతం మార్కులతో పీజీ/మాస్టార్స్ ఉత్తీర్ణత. ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈడబ్ల్యూఎస్, పీహెచ్‌సీ అభ్యర్థులకు 50 శాతం మార్కులతో పీజీ ఉత్తీర్ణత.
**నోట్:** యూజీసీ/సీఎస్ఐఆర్, ఐసీఎంఆర్/ఐసీఏఆర్, డీబీటీ/ఇన్‌స్పైర్ ఫెలోషిప్స్‌లో జేఆర్ఎఫ్ అవార్డు అయిన వారు పీహెచ్‌డీ ఎంట్రన్స్ టెస్ట్ నుంచి మినహాయింపు ఉంటుంది. అయితే కేటగిరీ–2 కింద సీటు కావాలంటే మాత్రం తప్పనిసరిగా ఎంట్రన్స్ రాయాలి.

**పరీక్ష విధానం**
- కంప్యూటర్ బేస్డ్ టెస్ట్ విధానంలో ఉంటుంది.
- పరీక్ష 70 మార్కులకు నిర్వహిస్తారు. 70 మల్టిపుల్ చాయిస్ ప్రశ్నలు ఇస్తారు.
- మల్టిపుల్ చాయిస్ ప్రశ్నలు.. అనాలజీస్, క్లాసిఫికేషన్స్, మ్యాచింగ్, కాంప్రహెన్షన్ తదితర విధంగా ఇస్తారు.
- లాంగ్వేజెస్ తప్ప మిగిలిన సబ్జెక్టులు ఇంగ్లిష్‌లో మాత్రమే ఉంటాయి.

**ముఖ్యతేదీలు**
**దరఖాస్తు:** ఆన్‌లైన్‌లో
**చివరితేదీ:** ఫిబ్రవరి 23
**వెబ్‌సైట్:** https://www.ouadmissions.com



## నార్మ్‌లో పీజీడీఎం

**హైదరాబాద్‌లోని నేషనల్ అకాడమీ ఆఫ్ అగ్రికల్చరల్ రీసెర్చ్ (నార్మ్)లో పీజీడీఎం ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదలైంది.**

**ప్రోగ్రామ్:** పీజీడీఎం (అగ్రి బిజినెస్ మేనేజ్‌మెంట్)
**అర్హతలు:** అగ్రికల్చర్ లేదా అనుబంధ విభాగాల్లో డిగ్రీ ఉత్తీర్ణతతోపాటు క్యాట్–2024/సీమ్యాట్–2025 స్కోర్ సాధించి ఉండాలి.
**ఎంపిక విధానం:** క్యాట్/సీమ్యాట్ స్కోర్, పర్సనల్ ఇంటర్వ్యూ, అనలిటికల్ రైటింగ్ స్కిల్ టెస్ట్, అనుభవం, షార్ట్ ప్రజంటేషన్, అకడమిక్ స్కోర్ తదితర అంశాల ఆధారంగా ప్రవేశాలు కల్పిస్తారు.
**దరఖాస్తు:** ఆన్‌లైన్‌లో
**చివరితేదీ:** ఫిబ్రవరి 28
**వెబ్‌సైట్:** https://naarm.org.in